హిందీ పరీక్షల్లో అప్పలరాజుగూడెం విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

టి.నరసాపురం: హిందీ పరీక్షల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి జె.దయాసాగర్ ప్రథమ స్థానంలో నిలిచాడని ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి.ఎస్.బి.శంకరరావు శుక్రవారం తెలిపారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారిచే ఏపిటిఆర్ఇఐ సొసైటీ స్కూల్లో ఇటీవల నిర్వహించిన హిందీ పరీక్షల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పదో తరగతి విద్యార్థి జె.దయాసాగర్ ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చన్నారు. దయాసాగర్‌ను ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్యులు నిల్.. రోగులు ఫుల్..!

ఏలూరు సర్వజన ఆసుపత్రి

ఏలూరు సర్వజన ఆసుపత్రి వైద్యుల కష్టాలు వర్ణనాతీతం
97 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 37 మందితోనే వైద్యం
ప్రతిరోజూ వెయ్యి మందికిపైగా ఓపి
500 మంది రోగులకు ఇన్‌పేషెంట్ సేవలు ఎలా?
పని భారంతో తల్లడిల్లుతున్న వైద్యులు
కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి పలు విభాగాలకు డాక్టర్లు నిల్
మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పట్టించుకోరా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని వైద్యులతో ప్రభుత్వం బంతాట ఆడుతోంది. సరిపడా వైద్యులను నియమించకుండా ఉన్న వైద్యులపై తీవ్ర పనిభారం మోపడంతో వారు పని చేయలేని పరిస్థితి కన్పిస్తోంది. సామాన్య ప్రజానీకానికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఆలోచన పాలకులకు ఏమాత్రం లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వం మెడికల్ కాలేజీ (బోధనా ఆసుపత్రి) అనుబంధ ఆసుపత్రిగా మార్పు చేసి మూడేళ్లు గడిచిపోతుంది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పరిస్థితి తయారైంది. సర్వజన ఆసుపత్రిగా మార్పు చేసిన తర్వాత కనీస వసతులు కూడా కల్పించకుండా పాలకులు గాలికొదిలేశారు. ఏలూరు సర్వజన ఆసపత్రికి ప్రతిరోజూ వెయ్యి మంది రోగులు ఓపి (అవుట్ పేషెంట్), 500 మంది రోగులు ఇన్‌పేషెంట్ సేవలను పొందుతారు. వీరందరికీ సేవలందించేందుకు నిబంధనల ప్రకారం సర్వజన ఆసుపత్రికి 97 మంది వైద్యులను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం అక్కడ పని చేస్తున్న వైద్యులు మాత్రం కేవలం 32 మంది మాత్రమే. 65 వైద్యుల పోస్టులను ఖాళీగా వదిలేశారు. ఉన్న కొద్దిమంది వైద్యులు పూర్తిస్థాయిలో ఏవిధంగా వైద్యసేవలు అందించగలరో ప్రభుత్వమే చెప్పాలి. దీంతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని వైద్యులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడైనా చిన్న తప్పు జరిగితే అధికారులు ముందు, వెనుకా ఆలోచించకుండా చర్యలు తీసుకుంటుండటంతో పరిస్థితి సైతం వైద్యులను మానసికంగా కుంగదీస్తోంది. అత్యంత ముఖ్యమైన చెస్ట్, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి పలు విభాగాలకు సంబంధించి ఒక్క డాక్టర్ కూడా లేని పరిస్థితి ఉంది. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి పది మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఐదుగురే ఉన్నారు. పిడియాట్రిక్స్‌లో ఆరు గురు వైద్యులకుగాను ముగ్గురే సేవలందిస్తున్నారు. డెర్మటాలజీలో ముగ్గురుకు ఇద్దరే ఉన్నారు. ప్రతి విభాగంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సరిపడా వైద్యులను నియమించకుండా వైద్యసేవలు ప్రజలకు ఏవిధంగా అందుతాయో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. సరిపడా డాక్టర్లను నియమించకుండా వైద్యవిధాన పరిషత్ కింద పని చేసే సీనియర్ డాక్టర్లను సైతం బదిలీ చేసిన పరిస్థితి ఉంది. సరిపడా వైద్యులను నియమించడంతోపాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో 24 గంటలు పని చేసే సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల్లో ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి. దీంతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక జనం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితిని తీసుకొచ్చారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పట్టించుకోరా..?

బోధన ఆసుపత్రిగా ఉన్న ఏలూరు సర్వజన ఆసుపత్రికి సంబంధించి పూర్తి అధికారాలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌కు ఉంటాయి. వైద్యులకు సంబంధించి పూర్తి అధికారాలు ప్రిన్సిపల్‌కే ఉంటాయి. నర్సులు, ఆసుపత్రిలో పనిచేసే ఇతర సిబ్బందికి సంబంధించి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో సాగుతాయి. మెడికల్ కాలేజీలో 30 మంది వైద్యులు అక్కడ పాఠాలు బోధిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో సేవలందించేందుకు అక్కడి వైద్యులను సైతం ఉపయోగించుకునే అవకాశం ఉంది. అయితే ఆ పని జరగడం లేదు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌కు ఆసుపత్రిలో సమస్యలు పట్టవా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిగేవరకూ మెడికల్ కాలేజ్‌లో పనిచేసే వైద్యులను ఆసుపత్రికి కేటాయిస్తే రోగులకు మేలు జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా ఏలూరు మెడికల్ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. 2023 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. 15 శాతం ఆలిండియా కోటా పోను ఇంకా 127 సీట్లు వరకూ ఉంటాయి. వీటిలో 50 శాతం ఉచితంగా, మరో 50 శాతం సీట్లను, బి కేటగిరిలో రూ.12 లక్షలు, సి కేటగిరిలో రూ.20 లక్షల ఫీజుతో కేటాయిస్తున్నారు. దీంతో గతేడాది విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజు దాదాపు రూ.11 కోట్లకుపైగా ఉంది. నిబంధనల ప్రకారం ఈ సొమ్ము మెడికల్ కాలేజ్ అనుబంధ ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులను కూడా ప్రభుత్వం మింగేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు పూర్తయ్యాయి. మరో రూ.11 కోట్లకుపైగా ఫీజుల సొమ్ము వస్తోంది. ఈ నిధులను కూడా ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేస్తారో, ప్రభుత్వం తీసేసుకుంటుందో వేచిచూడాలి. ఈ నిధులను ఇక్కడ ఉపయోగించేలా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రభుత్వంతో మాట్లాడి సాధించాల్సి ఉంది.

అత్యవసర విభాగం డాక్టర్ల నియామకంలో డిఎంహెచ్‌ఒ శ్రద్ధ పెట్టరా?

సర్వజన అత్యవసర విభాగం (క్యాజువాలిటీ) అత్యంత ముఖ్యమైనది. ఇక్కడ మూడు షిఫ్టులవారీగా వైద్యులు 24 గంటలూ వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇక్కడా ఆరుగురు డాక్టర్లకుగాను ఇద్దరే పని చేస్తున్నారు. ఏ విధంగా సేవలందిస్తారో పాలకులు చెబితే బాగుంటుంది. అత్యవసర విభాగంలో పని చేసే డాక్టర్లను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగం నియమించాల్సి ఉంటుంది. జిల్లాలో ఆ విభాగం అధికారి డిఎంహెచ్‌ఒ బాధ్యత తీసుకోవాల్సి ఉంది. అత్యవసర విభాగంలో డాక్టర్ల నియామకంలోనూ తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. సమస్యలు పరిష్కరించకుండా, సరిపడా వైద్యులు లేకుండా ప్రజలకు ఏవిధంగా వైద్యసేవలు అందుతాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంది.

ఏలూరులో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత రవికుమార్

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకే

మున్సిపల్ కార్మికుల రిలే దీక్షల్లో నేతలు స్పష్టీకరణ



జంగారెడ్డిగూడెంలో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించని పక్షంలో మరోసారి రాష్ట్రవ్యాప్తంగా పోరాటం, సమ్మె తప్పదని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, ఆర్.రవికుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టిన ఒకరోజు రిలే నిరాహార దీక్షను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించి సంవత్సరం గడిచినా, ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికుల ఉద్యమానికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం తోడుగా నిలబడుతుందని, వారి సమస్యలకు అండదండలుగా నిలుస్తుందని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నెం.36 ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.15 వేలే చెల్లిస్తున్నారని, స్కూల్ స్వీపర్లకు జిఒ నెం.7 ప్రకారం కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.4 వేలు, రూ.6 వేలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులు కష్టపడి పట్టణాల పరిశుభ్రత కోసం, తాగునీరు, భూగర్భ డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర కనీస అవసరాల కోసం పాటుపడుతూ ఉంటే వారికి ఇవ్వాల్సిన రక్షణ పరికరాలు చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె సంవత్సరాల తరబడి చెల్లించకపోవడం దారుణమన్నారు. అలాగే 12వ పిఆర్‌సిని తక్షణమే ప్రకటించాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, పెండింగ్ సరెండర్ లీవులు, డిఎలు ఇవ్వాలని, జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని వారు కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నగరాధ్యక్షులు వివివిఎస్.ప్రసాద్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి తదితరులు పాల్గొని మాట్లాడారు. మెడికల్ రిప్స్ యూనియన్ నగరాధ్యక్షులు సీతయ్య, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు రాంబాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాధవ, ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు శేఖర్ సంఘీభావం తెలిపారు. దీక్షాపరులకు షేక్ ముస్తఫాఅలీ, ఆర్.రవికుమార్ మెడలో పూలదండలు, ఎర్రని రిబ్బన్లు వేసి దీక్షలను ప్రారంభించారు. దీక్షా శిబిరానికి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య అధ్యక్షత వహించారు. ఈ దీక్షల్లో ఎ.జాన్‌బాబు, లావేటి కృష్ణారావు, జి.రాజారాంబాబు, వినుకొండ రమేష్, బి.సోమేశ్వరరావు, కానూరు సత్యనారాయణ, ఎం.దుర్గ, లక్ష్మీబాలాజీ, పూజిత, గౌసియా, ఎస్.కృష్ణవేణి, గౌసియా, పి.నాగరాజు తదితరులు కూర్చున్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు రిలే దీక్షలు నిర్వహించారు. దీక్షలను సిఐటియు పట్టణాధ్యక్షులు పి.సూర్యారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు, స్థానిక అధ్యక్షులు ఆర్.నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణరావు పాల్గొనగా, ఆటో ట్రక్ యూనియన్ నాయకులు డి.ఆశీర్వాదం, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతలు జిఎస్.నారాయణ, పట్టణ పౌర సమాఖ్య నేత వి.గోపి పాల్గొన్నారు.

కోడిపందేలంటే భయపడేలా చర్యలు

జూదం, గుండాటపై ఉక్కుపాదం
డివిజన్, మండలస్థాయిలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్

మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించాలంటే భయపడేలా అధికారులు చర్యలు ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా, మండలస్థాయి అధికారులు, పోలీసు, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో స్థానిక కలెక్టరేట్ నుంచి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం అక్రమ రవాణాపై నిరంతరం గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని డిఎస్‌పిలు, ఎస్‌హెచ్‌ఒలతో సమన్వయంతో పర్యవేక్షించడానికి సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోడిపందేలు, జూద క్రీడల వంటి వాటి జోలికి ముఖ్యంగా యువత వెళ్లకుండా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సంప్రదాయ క్రీడలు, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. రంగోలి తదితర కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. కోడిపందేల నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే మండలస్థాయిలో ఏర్పాటు చేసిన సంయుక్త తనిఖీ బృందాలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన స్థలాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపందేల కోసం సిద్ధం చేసిన మైదానాలను ట్రాక్టర్లు, జెసిబిల ద్వారా తొలగించాలన్నారు. కోడిపందేలు, జూదం, బెట్టింగ్ నిర్వహణ కోసం సేకరించిన డబ్బును సంబంధిత వ్యక్తుల నుండి సంయుక్త తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకునే అధికారం ఉందన్నారు. గ్రామస్థాయిలో కూడా పర్యవేక్షణా కమిటీలు ఏర్పాటు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. కీలక ప్రదేశాల్లో ప్రజల రాకపోకలను గుర్తించేందుకు నిఘా కెమెరాలతో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట నిర్వహించినా, బెట్టింగులకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందేలు, జూదాలు నిర్వహించే స్థల యజమానులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఎస్‌బి సిఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పీసా కమిటీల ఎన్నికలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలో తొమ్మిది పంచాయతీల్లో 25 గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. పూచిరాల గ్రామ ఉపాధ్యక్షులుగా మచ్చ చంద్రరావు, కార్యదర్శిగా కె.గంగరాజు, చిన్నబుర్రతోగు గ్రామ ఉపాధ్యక్షులుగా ఎం. సునీత, కార్యదర్శిగా ఎస్.నాగేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చాగరపల్లి గ్రామ ఉపాధ్యక్షులుగా టి.సునీత, కార్యదర్శిగా టి.మహేష్, తాట్కూరుగొమ్ము కాలనీ ఉపాధ్యక్షులుగా వి.ముత్యాలరావు, కార్యదర్శిగా కె.భానుప్రకాష్ ఎన్నికయ్యారు. చెరువుగొల్లగూడెం గ్రామ ఉపాధ్యక్షులుగా కె.ధర్మరాజు, కార్యదర్శిగా వి.రమేష్, పాతరెడ్డిగూడెం గ్రామ ఉపాధ్యక్షులుగా ఎం.మహేష్, కార్యదర్శిగా కె.గంగాధర్, మల్లారం గ్రామ ఉపాధ్యక్షులుగా కె.వినోద్‌కుమార్, కార్యదర్శిగా పి.వెంకటేష్, సోందే గొల్లగూడెం గ్రామ ఉపాధ్యక్షులుగా కె.రాజబాబు, కార్యదర్శిగా ఎస్.దుర్గయ్య, రామవరం గ్రామ ఉపాధ్యక్షులుగా ఆర్.వెంకటేష్, కార్యదర్శిగా ఎం.విజయ్ కుమార్, కాచారం గ్రామ ఉపాధ్యక్షులుగా పి.కామరాజు, కార్యదర్శిగా పి.మల్లయ్య, కోయిదా గ్రామ ఉపాధ్యక్షులుగా కె.మాధవరెడ్డి, కార్యదర్శిగా ఎస్.సురేష్, కోయమాదారం గ్రామ ఉపాధ్యక్షులుగా ఎం.కన్నయ్య, కార్యదర్శిగా కె.మారయ్య, మేడిపల్లి గ్రామ ఉపాధ్యక్షులుగా ఎం.ధర్మయ్య, కార్యదర్శిగా సోయం జోగారావు, కాకిసినూరు గ్రామ ఉపాధ్యక్షులుగా బి.చిట్టిబాబురెడ్డి, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

మిగులు భూముల్లో సాగుకు పేదలకు అవకాశం ఇవ్వాలి

హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలి - డిఆర్‌ఒకు వ్యకాస బృందం వినతి



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న వ్యకాస నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎర్రకాల్వ రిజర్వాయర్ భూముల్లో మిగులుగా ఉన్న మూడు వేల ఎకరాలను రెండు మండలాల్లో పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులకు సాగుకు అవకాశం ఇవ్వాలని, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద డిఆర్‌ఒ విశ్వేశ్వరరావుకు సంఘం జిల్లా బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని ఎర్రకాల్వ రిజర్వాయర్ కోసం సేకరించిన భూముల్లో మిగులు భూములు మూడు వేల ఎకరాలు ఉన్నాయన్నారు. 1985లో ఎర్రకాల్వ రిజర్వాయర్ కోసం తొమ్మిది వేల ఎకరాలు సేకరించగా నేటికి మూడు వేల ఎకరాలు ముంపులో లేవన్నారు. వాటిని ప్రభుత్వానికి అమ్మిన భూస్వాములే కొబ్బరి, పామాయిల్, మొక్కజొన్న, చెరుకు తదితర పంటలు సాగుచేసి అక్రమంగా ఫలసాయం అనుభవిస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలుగైదేళ్ల క్రితం వరకు వాళ్లు ఇందులోనే అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు సైతం కలిగి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకాలం ప్రభుత్వానికి శిస్తు పైసా కూడా చెల్లించలేదని, స్థానిక ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారుల సహకారంతో వారు దర్జాగా భూములను అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ భూముల్లో సాగుకు అవకాశం ఇవ్వాలని రెండు మండలాల్లోని పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు వందలాది మంది కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పేదలు గత 30 ఏళ్లుగా దరఖాస్తు చేస్తూనే ఉన్న మండల, కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధికారులకు దళితులు, గిరిజనుల గోడు పట్టడం లేదని విమర్శించారు. భూమిలేని పేదలు ఈ భూముల్లోకి వస్తే కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టిస్తామని భూస్వాములు బెదిరిస్తున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ద్వారా మిగులు భూములు పంచుతామని ప్రభుత్వాలు ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదన్నారు. 2024 నవంబర్లో హైకోర్టును ఆశ్రయించగా రిజర్వాయర్ మిగులు భూముల్లో పేదలు సాగు చేసుకునేందుకు హక్కు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న భూముల్లోకి ఆవులు, గేదెలు తోలి లక్షలాది రూపాయల విలువలు చేసే పంటను ధ్వంసం చేస్తున్నారని, వెంటనే హైకోర్టు తీర్పును అమలు చేసి పేదలకు ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.సుధారాణి, రాజు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో..

కొల్లేరు ప్రజల పొట్ట కొట్టొద్దు : సిపిఎం

కొల్లేరు వాసులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు లింగరాజు, శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

ఎకో సెన్సిటివ్ జోన్ (పర్యావరణ సున్నిత ప్రాంతం) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో కాంటూరుపైన పది కిలోమీటర్ల మేర ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలూ చేపట్టకూడదని 26 రకాల నిబంధనలు పెట్టి 89 గ్రామాల పరిధిలోని లక్షలాది మంది ప్రజలను నిరాశ్రయులను చేసే చర్యలను తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు అన్నారు. కొల్లేరు ప్రాంత పర్యటనలో భాగంగా తిమ్మారావుగూడెం, కె.దుర్గాపురం, చాటపర్రు, గుడివాకలంక తదితర గ్రామాలను వారు పర్యటించారు. కొల్లేరు గ్రామాల్లోని ప్రజలతో ప్రత్యక్షంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల చెరువులన్నింటినీ ధ్వంసం చేయడంతో లక్షలాది మంది కొల్లేరువాసులు జీవనం నాశనమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుండి నేటి వరకు కొల్లేరుప్రాంత వాసులకు ఉపాధి లేక సుదూర ప్రాంతాలకు వలస పక్షుల వలసలు పోతున్నారన్నారు. కొల్లేరును ఐదో కాంటూర్ నుండి మూడో కాంటూరు వరకూ కుదిస్తూ అసెంబ్లీలోసైతం తీర్మానాలు చేసినప్పటికీ నేటికీ అమలు జరగకపోవడం విచారకరమన్నారు. దానికి తోడు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తూ ఐదో కాంటూరుపైన ఉన్న పది కిలోమీటర్ల మేర లక్షలాది మంది ప్రజల జీవనాన్ని ధ్వంసం చేసే చర్యల పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొల్లేరులో రెగ్యులేటర్లు తక్షణమే నిర్మించి సంప్రదాయ వ్యవసాయానికి అవకాశం కల్పించాలని, కొల్లేరులో ఉన్న 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల జీవనానికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం అధ్యయనం చేసి ప్రజాభిప్రాయం మేరకు ఆందోళనలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కోడి పందేలకు సన్నాహాలు షురూ..!

పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల పేరిట చురుగ్గా ఏర్పాట్లు

వడాలిలో ఏర్పాట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్రాంతి సంబరాల పేరుతో మండలంలో కోడిపందేల నిర్వహణకు శిబిరాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మండలంలో ఇప్పటికే కోడి పందేల నిర్వహణకు అనువైన స్థలాలను, పొలాలను నిర్వాహకులు ఎంపిక చేసుకున్నారు. పండుగ నవీం మిన్నందున ఇప్పటికే పందెం కోళ్లను సిద్ధం చేయడం, కోళ్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్లతో ఇప్పటికే సంప్రదింపులు ఊపందుకున్నాయి. పందేలకు ఎంపిక చేసిన స్థలాలు, పొలాల్లో పేకాట, గుండాట శిబిరాలు ఏర్పాటు చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. స్థలాలను పోటీలకు అనువుగా సిద్ధం చేస్తున్నారు. జెసిబి, ట్రాక్టర్లతో స్థలాలను సిద్ధం చేస్తూ ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈసారి మండలంలో ఐదు గ్రామాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముదినేపల్లి, వడాలి, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, అల్లూరు గ్రామాల్లో పందేలు నిర్వహణకు ఏర్పాట్లు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వడాలి గ్రామ సమీపంలోని ఖాళీ పొలాల్లో పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముదినేపల్లిలోని బంటుమిల్లి రోడ్డులో నిర్వాహకులు రూ.30 వేలుపైబడి చెల్లించి మినుము పైరు ఉన్న చేను దున్నించి పందేలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ అయిదు బరులు కాకుండా మరో రెండు చిన్న బరులు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. ప్రభుత్వం మారినా నిర్వాహకులు మాత్రం గతంలో వారే ఉండడం గమనార్హం. ఎన్నికల ముందు పలువురు వైసిపి నాయకులు కూటమిలోని పార్టీల్లో చేరారు. దీంతో మళ్లీ వారే పందేల శిబిరాలు ఏర్పాటుకు పావులు కదుపుతున్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించడం షరామామూలైంది. పండుగ నాలుగు రోజులు పోలీసులు చేతులెత్తేయడం అందరికీ తెలిసిన విషయమే.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరం పేటలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పర్యటించారు. తొలత బాట గంగానమ్మను దర్శించుకున్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం నుంచి పంగిడిగూడెం వరకు ఏడు కిలోమీటర్లు మేర రూ.3.1 కోట్లతో బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నె రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థి సుభాష్ చంద్రబోస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శుక్రవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఈ స్కూలుకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, తల్లిదండ్రులతో ప్రేమతో మెలగాలని, ప్రతి వ్యక్తికి, గౌరవించాలని, చదువు పట్ల నిబద్ధత చేయకూడదని తెలిపారు. గొల్లపల్లి పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వజ్రోత్సవం వచ్చినట్లు చెప్పారు. అనంతరం సుభాష్ చంద్రబోస్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది సన్మానించారు.

ఘనంగా ట్రైకార్ ఛైర్మన్ బొరగం పుట్టినరోజు

ప్రజాశక్తి - పోలవరం

ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని ట్రైకార్ ఛైర్మన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా రూ.లక్ష కట్టి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. పోలవరంలోని మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు నాయకులు, కార్యకర్తలతో కలిసి అందించారు. టిడిపి మండల మాజీ అధ్యక్షుల పాపోలు గణపతి రత్నయ్య, తెలుగు యువత అధ్యక్షులు పెద్దిపాటి సత్యనారాయణ, ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు, వాణిజ్య విభాగ అధ్యక్షులు గుబ్బ రాంబాబు, మంగిసకొండ, మండలాధ్యక్షులు బొద్దు కృష్ణ, నూనె కాని రాంబాబు, పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, ఆకులు రాజా, ఏసురు శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

బొరగానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - నిడమర్రు

మండల కేంద్రమైన నిడమర్రులో మురుగు నీరు ముందుకు వెళ్లకుండా డ్రెయినేజీ వేసిన అడ్డాన్ని తొలగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు కోరారు. ఈ మేరకు గ్రామంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల అధికారులు స్పందించి విచారణ చేపట్టి డ్రెయినేజీ అడ్డం వేసినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోతురాజుబీది ప్రజలతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు, ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొట్టే నాగమోహన్‌రావు, కన్నాజి నాగబాబు, దోనేపూడి నాగేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వృత్తుల రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం వృత్తిదారులకు ఉప ప్రణాళికను ఏర్పాటు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్ పేటలోని సుందరయ్య గ్రంథాలయంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ-2025 క్యాలెండర్‌ను బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో వృత్తులు దెబ్బతింటున్నాయన్నారు. చేతివృత్తిదారులకు వారి జీవన ప్రమాణం పెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య గ్రంథాలయ నిర్వాహకులు కంది విశ్వనాథం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు ఎం.ఇసాక్, వృత్తి సంఘాల నాయకులు గనిగంటి కోటేశ్వరరావు, గొడ రంగారావు పాల్గొన్నారు.

భీమడోలు తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి - భీమడోలు

రెవెన్యూకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ పనితీరు కనపరిచిన జిల్లాస్థాయి ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపిక కావడానికి వెనుక భీమడోలు అధికారులు, సిబ్బంది, విఆర్‌ఒలు, ఇతర కార్యాలయ అందించిన సహాయ సహకారాలు కారణమని భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపికై ప్రశంసాపత్రాన్ని దక్కించుకున్న భీమడోలు తహశీల్దారును ఏలూరులో గురువారం కలెక్టర్, జెసి సత్కరించారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విఆర్‌ఒల ప్రతినిధి ఆకుల శ్రీను, సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణ్ కుమార్ ఇతర సిబ్బంది, అధికారులు తహశీల్దారును సత్కరించారు.

చింతలపూడి తహశీల్దార్‌కు అభినందన

చింతలపూడి : జిల్లాలో పనితీరు ఆధారంగా ద్వితీయ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని, ఈ విజయం సాధించడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ సదస్సు నిర్వహణకు, పనితీరుకు జిల్లాలో మండల ద్వితీయ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పలువురు తహశీల్దార్ ప్రమద్దులకు అభినందనలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో టిడిపి నేత మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రోడ్డు ప్రమాదంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు బడుగు సోమయ్య(55) మృతి చెందారు. ఈ ప్రమాదం విజయవాడలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండల పరిధిలోని చిన్నాగిపల్లి గ్రామానికి చెందిన బడుగు సోమయ్య శుక్రవారం పెద్ద కుమార్తె అయిన తోటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బడుగు మమతతో కలిసి బైక్‌పై విజయవాడ వెళ్లారు. ఎన్‌ఆర్‌ఆర్ కాలేజీ సమీపంలో అదే రోడ్డు తగలడంతో బైక్ అదుపు తప్పి సోమయ్య కింద పడటంతో అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఆయన మీదకు ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మమతకు గాయాలయ్యాయి. సోమయ్య తల్లి బడుగు సమాధాన గతంలో చిన్నాగిపల్లి గ్రామ సర్పంచిగా పనిచేశారు. సోమయ్య మృతితో చిన్నాగిపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆయన మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమయ్య రెండో కుమార్తె సిస్టర్‌గా మరో ఉండగా, మూడో కుమార్తె హిందీ పండిట్ పూర్తి చేసి డిఎస్‌సికి సన్నద్ధం అవుతుంది. కుమారుడు హోమియో విద్యను అభ్యసించి ప్రస్తుతం విజయవాడలోని హెల్త్ హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు.

కోడి పందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కోడిపందేల బరులను రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నూజివీడు టౌన్ ఎస్ఐ ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ కోడిపందేల నిర్వాహకులు అనుమతులు లేవన్నారు.

టి.నరసాపురం : సంక్రాంతి పేరుతో కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరులను శుక్రవారం ఎస్ఐ ఎం.జయబాబు, తహశీల్దార్ సాయిబాబా ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. స్థానిక పామాయిల్ తోటలో సిద్ధం చేసిన బరులను జెసిబి సాయంతో ధ్వంసం చేశారు.

ఆగిరిపల్లి : చిన్నాగిపల్లిలో కోడిపందేల నిర్వహణ కోసం సిద్ధం చేసిన బరులను తహశీల్దార్ పివిఎన్.ప్రసాద్ ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్‌తో కలిసి ధ్వంసం చేయించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటానికి సిద్ధంగా ఉండాలని సిపిఎం మండల కార్యదర్శి దుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యదర్శి వర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పాటు పడుతున్న సిపిఎం నాయకులను, కార్యకర్తలను ప్రధాని పర్యటన సందర్భంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విశాఖ ఉక్కుపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శవర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, చిట్టి బొమ్మ కొండలరావు, రాజమండ్రి దానియేలు పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంక్రాంతి పండుగ సందర్భంగా ఏలూరు నగరానికి విచ్చేస్తున్న అతిథులను ఆహ్వానిస్తూ నగరాన్ని సుందరీకరిస్తున్నామని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ ఆదేశాల మేరకు ఏలూరు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా పరిశుభ్రత సుందరీ కరణ పనులను శుక్రవారం ఏలూరులోని జ్యూట్‌మిల్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం, సచివాలయ సిబ్బంది ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజులు ముందుగా గుర్తించిన ముఖ్య ప్రదేశాలను పరిశుభ్రత చేసి సుందరీకరణ చేస్తున్నామన్నారు. డివైడర్లకు వివిధ రకాల రంగులను వేసి నగరాన్ని ముస్తాబు చేస్తున్నామన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు డివైడర్లలో ఉన్న వీధిలైట్లు స్తంభాలకు రంగులు వేయడం, ఎల్ఇడి తోరణాలతో అలంకరించి విద్యుత్ కాంతులతో నగరాన్ని సుందరీకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, కార్పొరేటర్లు, ఎఇలు, డిఇలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోటల సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండల పరిధిలోని హనుమంతులగూడెం గ్రామంలో మామిడి తోటలను ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. రైతు నల్లబోయిన రమేష్ తోటలో మామిడి కోతను సందర్శించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ తామర పురుగు నివారణకు నీలం, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - భీమడోలు

నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నెలవారీ నిర్వహిస్తున్న జాబ్‌మేళా సేవలను వినియోగించుకోవాలని సంస్థ జిల్లా ప్రతినిధి జితేంద్ర కోరారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో అభ్యర్థుల ఎంపిక కార్యక్రమాలకు ముత్తూట్ ఫైనాన్స్, రాష్ట్ర స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్ లిమిటెడ్ ఇతర సంస్థల అధికారులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు 45 మంది హాజరు కాగా వీరిలో ఎంపికైన 18 మందికి నియామక పత్రాలను సంబంధిత యాజమాన్యాలు అందించాయి.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు, మిఠాయిలను సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను శుక్రవారం అందించారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా కార్మికులకు ఈ విధంగా నూతన వస్త్రాలు అందించడం పట్ల కార్మికులు సర్పంచికి, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ కార్యాలయాల పనితీరు మరింత మెరుగు పరిచేలా పర్యవేక్షణ చేయాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. మండల పరిషత్ అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మండల పరిషత్ అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా పరిషత్‌లో మంజూరైన పనుల ప్రగతి, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పనుల ప్రగతిని సమీక్షించారు. పనులపై ఆడిట్ జరిపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కెఎస్ఎస్.సుబ్బారావు, ఉపముఖ్యకార్యనిర్వాహణ అధికారి భీమేశ్వర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ ఎస్.శ్రీనివాస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ రమణమూర్తి, డ్వామా పీడీ వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మశ్రీ

ఉచిత న్యాయ సలహాలకు 15100

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్


వసతిగృహంలో రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం తంగెళ్లమూడిలోని విన్సెంట్ డి పాల్ మానసిక విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో అందిస్తున్న వైద్య, ఆహార సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మానసిక విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ పథకాలను పొందటంలో, ఆస్తులు పొందడంలో సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అన్నే డిసి, ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా పనిచేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ రాణి

ముసునూరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా పని చేయకపోవడంతో జిల్లాలో 11వ స్థానంలో ఉన్నామని ఎంపిడిఒ జి.రాణి ఆవేదన వ్యక్తం చేశారు. ముసునూరు మండల సర్వసభ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ మండలంలో పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా పని చేయకపోవడంతో జిల్లాలో ముసునూరు మండలం 11వ స్థానంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పలు శాఖల అధికారులు ఆయా శాఖల పురోగతిపై మాట్లాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండాలని, రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మండల శాఖ అధికారులకు సూచించారు. తహశీల్దార్ జి.పురుషోత్తమశర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి రీ సర్వే గతంలో మిగిలిపోయిన గ్రామాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సర్పం చులు, ఎంపిటిసి సభ్యులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కన్నతల్లి, పెరిగిన ఊరు చదివిన బడి రుణాన్ని కొంతైనా తీర్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కెఎస్.లోవకుమారి అన్నారు. 1992 నుంచి 97 వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు జీవితంలో స్థిరపడి, తాము చదివిన పాఠశాలకే ఉపాధ్యాయులుగా వచ్చి చక్కటి సేవలందిస్తూ వసతులు ఏర్పరచడానికి కృషి చేస్తున్నారని, వారు ఎంతో అభినందనీయులన్నారు. పూర్వ విద్యార్థులు తల్లాడి జగదీష్ బాబు, పమ్మిడి అనిల్, కట్టా శ్రీనివాసరావు, కూరగంటి ఫణి, సోమన నాగేశ్వరరావు, సత్యలత, పద్మ, విజయశ్రీ , అరుణజ్యోతి తదితర 1992 - 97 పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన కంప్యూటర్ ప్రింటర్‌ను ప్రధానోపాధ్యాయుల వారికి అందించారు. గత నెల ఉద్యోగ విరమణ చేసిన స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయులు జి.మధుసూదనరావు కంప్యూటర్ మానిటర్‌ను బహుకరించారు.


ప్రింటర్‌ను అందిస్తున్న పూర్వవిద్యార్థులు

హామీలేని రుణాల మంజూరు కోరుతూ ధర్నా

ఏలూరు అర్బన్: జిల్లాలో గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు హామీలేని రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ జిల్లాలో 70 నుంచి 80 శాతం మంది కౌలురైతులే పంటలు పండిస్తున్నారన్నారు. బ్యాంకులు వీరికి పంట రుణాలు మంజూరులో సహకరించడం లేదన్నారు. అనంతరం వ్యవసా య శాఖ జెడికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేద ప్రజలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని చెప్పి సెంటు స్థలంలో చాలీచాలని ఇంటి స్థలాన్ని కేటాయించారన్నారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో పలు అభివృద్ధి పనులను ఉంగుటూరు ఎంఎల్ఎ ఈ నెల 11న ప్రారంభిస్తారని ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ తెలిపారు. గొల్లగూడెంలో రూ.90 లక్షలు, చేబ్రోలులో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, గోపీనాథపట్నంలో మిని గోకులం షెడ్డులను ప్రారంభిస్తారు. గొల్లగూడెంలో అవసరమైన చోట సిమెంటు రోడ్లు నిర్మాణం కోసం ఎంఎల్ఎ ధర్మరాజు రూ.90 లక్షలు మంజూరు చేయించడంతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు టిడిపి నాయకుడు వేములపల్లి సుధీర్ తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించకపోతే సమ్మె

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ విడుదల చేయకపోతే ఈ నెల 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు తెలిపారు. ఈ మేరకు చింతలపూడి ఏరియా హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌కు శుక్రవారం నోటీసు అందించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో చింతలపూడి ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు తుర్లపాటి మరియమ్మ, జి.వెంకట్రావు, పసుపులేటి వాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఫస్ట్ సెక్టార్‌లోని లంకపేట అంగన్వాడీ కేంద్రాన్ని ప్రదం పిఎంఒ కోమలి శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా ప్రీస్కూల్ యాక్టివిటీస్‌ను గమనించారు. అనంతరం రహమత్ నగర్, చోడిదెబ్బ, ద్వారకానగర్ అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎ.పద్మావతి, సూపర్‌వైజర్ మంగ, స్టేట్ కోఆర్డినేటర్ ప్రదం జగదీష్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపేట

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిమెంట్ రహదారి నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలు రావిచెట్టు వీధిలో 124 మీటర్ల పొడవు, 3.1 మీటర్లు వెడల్పుతో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాందే లక్ష్మీసునీత, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మోడల్ విలేజ్‌గా గొల్లగూడెం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో గొల్లగూడెం గ్రామాన్ని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు మోడల్ విలేజ్‌గా ఎంపిక చేసి రూ.90 లక్షల గ్రాంట్ విడుదల చేశారు. నిధులతో 1250 మీటర్ల సిమెంట్ రోడ్లను సర్వాంగ సుందరంగా నిర్మించామని కూటమి నాయకుడు వేమూరి సుధీర్ తెలిపారు. గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్లు నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. 11వ తేదీన రోడ్లు ప్రారంభించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సూర్య తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మినుము సాగు చేస్తే చీడపీడలను సులువుగా తొలగించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆలీనగరంలో మినుము పైరుకు ఆశించే పొగాకు, లద్దె పురుగు, పచ్చ పురుగు నివారణకు ఉపయోగించే బ్రహ్మాస్త్రమును సామూహికంగా శుక్రవారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలతో ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండవల్లి, ముదినేపల్లి మండలాలకు చెందిన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్త పట్టిసీమలో డ్రైడే

ప్రజాశక్తి - పోలవరం

కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణ కోసం అయిల్ బాల్స్, టెమిపాస్ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ఒ బి.నాగేశ్వరరావు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చవలం విజయలక్ష్మి, ఎఎన్ఎంలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూలులో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆర్‌వి.నాగరాజు మాట్లాడారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకేలా నిర్వహించారు. భోగి మంటలతో సంక్రాంతి వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు గోదాదేవి, హరిదాసు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులను పూలు, భోగి పండ్లతో ఆశీర్వాదించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనలతో సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నితిన్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : లిటిల్ ఫ్లవర్ స్కూలులో...

నూజివీడు టౌన్ : పట్టణంలోని కృష్ణ విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంఆర్ఎఆర్ కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పిజి సెంటర్ ఆవరణను అందమైన రంగవల్లులతో ముస్తాబు చేశారు. భోగిమంటల వెలుగుల్లో, గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి ఇనుమా డించింది. కొత్త బియ్యంతో పొంగల్, పులగం వంటలు సంబరాలు మరింత కాంతులను పంచాయి. ఈ సందర్భంగా పిజి సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ నవీన లావణ్యలత మాట్లాడారు. డాక్టర్ తిరుమలరావును సన్మానించారు.

జంగారెడ్డిగూడెం : డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న చైతన్య కార్యక్రమాలు అభినందనీయమని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ పండుగల నేపథ్యంలో యువత జూద క్రీడల వైపు మొగ్గు చూపకుండా సాంప్రదాయ క్రీడలను అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త ధనకుమార్, భాస్కర్ ట్రావెల్స్ అధినేత ఇమ్మడి భాస్కర్, నేలపోలు ప్రభాకర్, కౌన్సిలర్ కె.లావణ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు, కార్యదర్శి పటాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్.శ్రీనివాస్, ఇ.శ్రీనివాస్, సభ్యులు చల్లా రామకృష్ణ, దాసరి నాగరాజు, అంజి పాల్గొన్నారు.

భీమడోలు : కళాశాల విద్యార్థులు సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలని భీమడోలు శ్రీ మాధురి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం కళాశాలలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల యాజమాన్యం తగు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

కోడిపందేలు, జూదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమడోలు

సంక్రాంతి పండుగను సాంప్రదాయ రీతిలో ఆటపాటలు, సంతోషాల మధ్య నిర్వహించుకోవాలని తహశీల్దార్ బి.రమాదేవి కోరారు. పోలసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సంక్రాంతిని పురస్కరించుకొని జూదాలు వద్దని శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి షేక్ రహీమా బేగం హసేన అధ్యక్షత వహించారు. తహశీల్దార్, సర్పంచి మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గ్రామ పురవీధుల్లో కోడిపందేల నిషేధంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. నాగేంద్ర స్వామి గుడి సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు.

పంచాయతీ సిబ్బందికి సత్కారం

ఎా ల నా ని ఎ్ లి గ్రామపంచాయతీ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, షేక్ హసేన దంపతులతో పాటు, గ్రామపంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ నూతన కార్యక్రమాన్ని సంక్రాంతి సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకి చెందిన సిబ్బందితోపాటు, పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య, నీటి సరఫరా విభాగాలకు చెందిన కార్మికులకు వారు నూతన దుస్తులు పంపిణీ చేశారు. దీనికి అదనంగా వారికి నిత్యావసర వస్తువుల ప్యాకెట్లను అందించారు.

జీలుగుమిల్లి : మండలంలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు జరగకుండా చూడాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.ఉదయ్‌భాస్కర్ ఆదేశిం చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆగిరిపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు వద్దని, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి సాంప్రదాయ క్రీడలు ముద్దని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లిలో పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లి : కోడిపందేలు, ఇతర జూదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన నిమిత్తం శుక్రవారం ముదినేపల్లిలో మండల జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుభాని మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంప్రదాయం ఉట్టిపడేలా జరుపుకోవాలన్నారు. ఈ ర్యాలీలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, ఎస్ఐ వీరభద్రుడు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని, జూదక్రీడలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ఎం.జయబాబు, తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జూదాలపై అవగాహనా ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కుటుంబాలతో సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలన్నారు. కోడిపందేలు, పేకాట వంటి జూద క్రీడలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమడోలు : అవగాహనా ర్యాలీ

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/2019/డి.బి ది.09-01-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.21 (1-10) / BHI/General/2024-25/E1/E2 & టెండరు నోటీసు నెం.21(11-13) BHI/General/2024-25/E1 లోని జనరల్ ఫండ్స్ నుండి 13 పనులకు సంబంధించి రూ. 81.27 లక్షలతో ఇ-ప్రోక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రోక్యురుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘము, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543 వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814